క్లుప్తంగా

నిందితులను అరెస్ట్ చేయాలి

ఖానాపూర్: నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలో ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న దళిత ఉపాధ్యాయుడిపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్, అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగంలో దేశం ప్రధాన భూమిక పోషిస్తున్న తరుణంలోనే ఉపాధ్యాయులపై దాడులు జరగడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో బానావత్ గోవింద్, రాచమల్ల అశోక్, బొమ్మెన రాకేష్, సంగర్తి రాజన్న, ఫారుఖ్, అఖిల్ పాల్గొన్నారు.

దుమ్ము లేవకుండా చర్యలు



కనకాపూర్‌లో నీళ్లు పడుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ నుంచి నిర్మల్‌రూరల్ మండలంలోని కొండాపూర్ వరకు నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. కనకాపూర్–రత్నాపూర్‌కాండ్లీ గ్రామాల మధ్య జరుగుతున్న పనులతో దుమ్ము లేస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 8న 'దుమ్ము లేస్తోంది' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం ఉదయం నుంచి రోడ్డుపై నీళ్లు పట్టించడం ప్రారంభించారు.

పాఠశాలను పునఃప్రారంభించాలి

తానూరు: మండల కేంద్రంలో మూతపడిన శిశుమందిర్ పాఠశాలను తిరిగి పునఃప్రారంభించాలని విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక విఠలేశ్వర మందిరం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వసంతపంచమి రోజున పాఠశాలను ప్రారంభించనున్నట్లు సమావేశంలో తెలిపారు. కార్యక్రమంలో విభాగ్ సభ్యులు రావుల సత్యనారాయణ, కట్టణచారి, జిల్లా అధ్యక్షుడు కిషన్, ధర్మపురి సుదర్శన్, భోసి శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దత్తాత్రి, సర్పంచ్ విఠల్, నాయకులు సోంనాథ్, శివాజీపటేల్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు



పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ హైస్కూల్లో ఈనెల 9 ,10, 11 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్ కోసం ఆదివారం మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు, నీటి వసతి ఏర్పాట్లు చేశారు. డీఈఓ రవీందర్‌రెడ్డి వినతి మేరకు పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. మూడు రోజులపాటు పారిశుధ్య పనులు చేపడుతామని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్ ఉన్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు రమేష్ మేనత్త మోతక్క ఇటీవల మరణించింది. ఆదివారం బాధిత కుటుంబసభ్యులను బీజేపీ నాయకుడు రామారావు పటేల్ పరామర్శించారు. వారి వెంట బీజేపీ నాయకులు మంద భాస్కర్, మంద గణేశ్, జయసాగర్, లింగారెడ్డి, సాయన్న ఉన్నారు.

ఘనంగా తులాభారం, దీపోత్సవం



ఆలయంలో తులాభారం

మామడ: మండలంలోని పొన్కల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో శ్రీకృష్ణతులాభారం,దీపోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని వారితోపాటు సమీప ప్రాంతాల భక్తులు తెచ్చిన పండ్లతో ప్రతిమలను తులాభారం వేశారు. అనంతరం విగ్రహాలతో దీపాలు అలంకరించారు. అర్చకులు రామాచంద్రచార్యులు, విజయ్‌స్వామి ధనుర్మాస విశిష్టతను వివరించగా భక్తులు మంగళహారతులతో దర్శించుకున్నారు.

సాగు సంబురం





జిల్లాలో యాసంగి వరినాట్లు జోరందుకోగా రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. నిర్మల్‌రూరల్ మండలంలోని చిట్యాల, తల్వేద, మంజులాపూర్ గ్రామాల్లో కొందరు పొలం దున్నుతుండగా మరికొందరు కూలీలతో వరినాట్లు వేయిస్తున్నారు. ఆ దృశ్యాలివీ.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్





అనుమానాస్పద మృతి



శంకర్(ఫైల్)

ఖానాపూర్: పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన సిరికొండ శంకర్(45) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై శంకర్ వివరాల ప్రకారం మస్కాపూర్ గ్రామ శివారులోని తన చేను వద్ద ఉన్న మంచెపై నుంచి దిగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడన్నారు. సమీపంలోని రైతులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. శంకర్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్), దాసునాయక్ తండాల్లో ఈనెల 9,10 తేదీల్లో కబడ్డీ టోర్నీ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజాచైతన్యయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ రూ.5వేలు, తృతీయ బహుమతి రూ.2వేలు అందజేస్తామన్నారు. వివరాలకు 6302502194, 9490066895 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



లబ్ధిదారుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: పేదలకు సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు దేగాం గ్రామంలోని తన నివాసంలో ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించారు. ముధోల్ మండలం అబ్దుల్లాపూర్‌కు చెందిన భోజవ్వకు రూ.16వేలు, తానూరు మండలం బెంబరకు చెందిన పీరాజీకి రూ.28వేలు, కుభీర్ మండలం కుప్టికి చెందిన పాండురంగ్‌కు రూ.లక్ష, వర్ని గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రూ.11వేలు, నిగ్వా గ్రామానికి చెందిన భూలక్ష్మికి రూ.60 వేలు, భైంసా మండలం బిజ్జూర్ గ్రామానికి చెందిన భోజారెడ్డికి రూ.30వేల విలువైన చెక్కులు మంజూరవగా బాధిత కుటుంబీకులకు ఎమ్మెల్యే అందజేశారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

మండలంలోని కోతల్‌గాం గ్రామంలో అన్నాబాహు సాఠే సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి విన్నవించగా సానుకూలంగా స్పందించారు.

పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని వినతి

మండలంలోని టాక్లి గ్రామంలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి విన్నవించారు. పోలింగ్ బూత్ లింగా గ్రామంలో ఉండటంతో ఎన్నికల వేళ గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో భైంసా మండల కోఆప్షన్ సభ్యులు గజానంద్, రాజేశ్వర్, సచిన్, వెంకట్‌రెడ్డి, రమేశ్, మొయినొద్దీన్, సంజీవ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. 'రేషన్'కు ఏది రక్షణ?



లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ గోదాముల్లో ఆరుబయట రేషన్‌బియ్యం బస్తాలను అధికారులు నిర్లక్ష్యంగా నిల్వచేశారు. ప్రహరీ, గేట్ లేకపోవడంతో కుక్కలు, పందులు ఆవరణలోకి చొరబడి సంచులను ధ్వంసం చేసే అవకాశాలెక్కువ. అధికారులు రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రమేశ్, డీటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఫోన్: 9441139076

పంటలకు అడవిపందుల బెడద

- చీరెలు కట్టి రక్షించుకుంటున్న రైతులు
- చర్యలు చేపట్టాలని అధికారులకు వేడుకోలు



ముధోల్‌లో శనగ పంట రక్షణకు పాత చీరెలు కట్టిన రైతు

ముధోల్: ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్న రైతులకు బాధలు తప్పడం లేదు. ముధోల్ మండల కేంద్రంతో పాటు సమీప గ్రామాల్లో ఎక్కువ మొత్తంలో శనగ, మొక్కజొన్న, వరి, కూరగాయల పంటలను సాగు చేశారు. పంట చేతికొచ్చే దశలో అడవిపందులతో పాటు జింకలు నష్టం చేకూరుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో చేసేదేం లేక రాత్రి, పగలు పంట వద్దే కాపలా ఉంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జింకలు, రాత్రి వేళ అడవి పందులు తిరుగుతూ చేతికొచ్చిన పంటలను తినేస్తున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేన్ల వద్దకు కాపలా వెళ్లిన రైతులపై కూడా అడవిపందులు దాడులు చేస్తున్నాయని అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

చీరలతో రక్షణ..

రైతులు పంటలను కాపాడుకునేందుకు తమ ఇంట్లో ఉన్న వాటితోపాటు సంతకు వెళ్లి పాత చీరలను తీసుకొచ్చి చుట్టూ రక్షణగా కడుతున్నారు. మరికొందరు సోలార్ ఫెన్సింగ్ ద్వారా పంటలను రక్షించుకుంటున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపడితే పంటలు నష్టపోకుండా ఉంటామని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్‌లను తమకు మంజూరు చేయాలని పేర్కొంటున్నారు.

పంటలను కాపాడుకునేందుకు ముధోల్ ఏవో అజ్మీరా భాస్కర్ పలు మార్గాలు వివరించారు.

నివారణ మార్గాలు..

- మనుషుల తల వెంట్రుకలను పంటల వద్ద, పందులు వచ్చే మార్గంలో వేయడం ద్వారా పంటను కాపాడుకోవచ్చు. వాసన చూస్తూ పంటలకు వచ్చే పందుల ముక్కులోకి వెంట్రుకలు వెళ్లి పందులను బాధిస్తాయి. దీంతో ఇటువైపు రాకుండా ఉంటాయి.
- రాత్రివేళ పంటల వద్ద టపాసులు కాలిస్తే పందులు భయంతో పారిపోతాయి.
- పరిసరాల్లో కుళ్లిపోయిన కోడిగుడ్ల వ్యర్థాలను వేయడం ద్వారా దుర్వాసనకు జంతువులు పంటల వద్దకు రాకుండా ఉంటాయి.
- సోలార్ ఫెన్సింగ్ ఖర్చుతో కూడుకున్నదైనా అడవి జంతువుల నుంచి పంటకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ కంచెను మనుషులు, పశువులు తాకినా ప్రాణనష్టం ఉండదు.
- పంటల చుట్టూ కందకాలు తవ్వడం ద్వారా జంతువులు రాకుండా ఉంటాయి. దీంతో భూగర్భజలాలు కూడా పెరుగుతాయి.

పంట చుట్టూ చీరలు కట్టా



రెండు ఎకరాల్లో శనగ పంట సాగు చేశా. జింకల బెడద ఎక్కువగా ఉండడంతో పంట చుట్టూ పాతచీరలు కొనుక్కొచ్చి కట్టా. అయినప్పటికీ పై నుంచి దూకి పంటలను నష్టపరుస్తున్నాయి. అధికారులు జింకల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలి. – యోగేష్, ముధోల్

పాట్లు పడుతున్నాం



గోదావరి నది ప్రాంతంలో వేసిన మొక్కజొన్న, శనగ పంటలను అడవి పందులు నష్టపరుస్తున్నాయి. కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నాం. జంతువులు పంటల వద్దకు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– కృష్ణారెడ్డి, అష్ట

జ్యుడీషియల్ ఎంప్లాయీస్ జిల్లా కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌రూరల్: జ్యుడీషియల్ ఎంప్లాయీస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.విశాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సాధభూషణం, జనరల్ సెక్రెటరీగా నవీన్‌రెడ్డి, కోశాధికారిగా ఫిరోజ్ ఖాన్, జాయింట్ సెక్రెటరీగా నరేంద్రకుమార్, లేడీ రిప్రజెంటేటివ్స్‌గా సరస్వతి, నరసవ్వను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గాన్ని సన్మానించారు.

జన్మదిన వేడుకలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని టీఎస్జీవోస్ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి కుడాల రవికుమార్, కోశాధికారి సురేందర్, ఉపాధ్యక్షులు శ్రీరామ్, శ్రీనివాస్, ఖానాపూర్ యూనిట్ అధ్యక్షులు ఎర్ర రవీందర్, బి.శ్రీనివాస్, అజయ్‌కుమార్, రాఘవేందర్ పాల్గొన్నారు.

నంది రామయ్యకు పరామర్శ

ఖానాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్యను ఖానాపూర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంగారావు పరామర్శించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామయ్య ఉన్నారు.

రైతు బజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	40
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	50
ఉల్లిగడ్డ	25
ఆలుగడ్డ	30

– నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : ధమాకా
నారాయణ : అవతార్
వెంకటేష్ : లాఠీ

భీమన్న ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యే రేఖానాయక్‌ను సన్మానిస్తున్న నేతలు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీ భీమన్నదేవుని ఆలయంలో ఎమ్మెల్యే రేఖానాయక్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి 21 తులాల వెండి గొడుగు మొక్కు చెల్లించుకొని పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు సాయిబాబా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేను తన నివాసంలో కలిసి ఈనెల 24న జరిగే వార్షికోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆర్థోపెడిక్‌గా చేరిన ప్రశాంత్ ఎమ్మెల్యేను కలిశారు. రాజేందర్, ఖలీల్, సురేశ్, రాజగంగన్న, సంతోశ్, శంకర్, రాజేశ్వర్, నాగరాజు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెంబి మండల కేంద్రంలో సోమవారం పెంబి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు సతీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభించిన చైర్మన్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించే లెదర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. చైర్మన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని మొదటి మ్యాచ్ ప్రారంభించారు. క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కృష్ణ, రిజ్వాన్, సందీప్ ఉన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్‌రూరల్: టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆదివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ నిర్మల్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని.. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్, జిల్లా బాధ్యులు పరమేశ్వర్‌కుర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

ఖానాపూర్: రవాణా రంగంలోని ఆటో కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.శేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలో తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆయన మాట్లాడారు. ఈనెల 3న ప్రారంభమైన రవాణారంగ కార్మికుల సంఘర్షణ యాత్ర ముగింపు సభ ఈనెల 11న సంగారెడ్డిలో ఉంటుందన్నారు. యాత్ర జయప్రదం అయ్యేలా కార్మికులంతా కృషి చేయాలని కోరారు. ఆర్టీసీ పరిరక్షణతోపాటు మోటారు వాహనాల చట్టం 2019లో సవరణలు చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించడంతోపాటు ఓవర్‌లోడ్ పెనాల్టీలను తగ్గించి, కార్మికులు కోరిన చోట అడ్డాలు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదబీమా సౌకర్యం రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. కేరళలోని సవారీ యాప్ తరహాలో యాప్‌ను దేశవ్యాప్తంగా తీసుకురావాలన్నారు. ఇసాక్, విజయ్, మధుకర్, సతీశ్, సాబిర్, అజిత్, రమేశ్, మోహిన్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి అండ



సాయం అందిస్తున్న మిత్రులు

లోకేశ్వరం: బాధిత కుటుంబానికి సాయం అందించి అండగా నిలిచారు బాల్యమిత్రులు. మండలంలోని పోట్‌పల్లికి చెందిన సాయన్న ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. బెల్లంపల్లిలో సాయన్నతో కలిసి 1989–90లో పదోతరగతి చదివిన అతడి మిత్రులు రూ.53వేలు జమ చేశారు. ఆదివారం సాయన్న తల్లిదండ్రులు సాయన్న, భూమవ్వకు సదరు నగదును అందజేశారు. కార్యక్రమంలో సాయన్న మిత్రులు రామకృష్ణ, మోహన్, ఈశ్వర్, సంజీవ్‌కుమార్, గంగాధర్, గ్రామస్తులు ఎల్లన్న, లక్ష్మణ్‌పటేల్, హర్ష ముత్తన్న పాల్గొన్నారు.